తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | మంగళవారం - 11- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 68 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in



# వరుణదేవునికి సీఎం ప్రత్యేక పూజలు

**రేవంత్ రెడ్డి దంపతుల పూర్ణాహుతి**
**108 మంది రుత్వికులతో యాగం**
**ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతుల హాజరు**
**సాగర్‌లో ఘనంగా మహా వరుణయాగం**

**నాగార్జునసాగర్, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం సోమవారం నాగార్జునసాగర్‌లో ఘనంగా ముగిసింది. కృష్ణానది తీరంలోని విజయ్ విహారం వద్ద నిర్వహించిన ఈ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని శాస్త్రోక్తంగా పూర్ణాహుతి సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య భక్తిశ్రద్ధలతో యాగం కొనసాగింది. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో

మిగతా 2లో

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కార్యక్రమంలో రాజకీయ వేడి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం
- ప్రభుత్వ వేదికపై రాజకీయ విమర్శలు చేయొద్దని సూచన
- వాస్తవాలు చెప్పాలని మంత్రులకు విజ్ఞప్తి
- కమలాపూర్ కార్యక్రమంలో చర్చనీయాంశమైన వ్యాఖ్యలు

**హుజూరాబాద్, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):**
కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా రాజకీయ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రసంగిస్తున్న సమయంలో రాజకీయ విమర్శలు, వాస్తవాలకు విరుద్ధమైన వ్యాఖ్యలు చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో రాజకీయ అంశాలను ప్రస్తావించడం సరికాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాల వేదికలను రాజకీయ విమర్శలకు ఉపయోగించకూడదని సూచించారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ "అబద్ధాలు చెప్పొద్దు.. నిజాలు మాట్లాడాలి" అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలకు తెలియజేయడం ముఖ్యమని పేర్కొన్నారు.

మిగతా 2లో



## కాళేశ్వరం మోటార్లు వెంటనే ప్రారంభించాలి

**హరీష్ రావు లేఖతో ప్రభుత్వానికి విజ్ఞప్తి**
**నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్**
**రిజర్వాయర్లు నింపి రైతుల ఆందోళన తొలగించాలని సూచన**
**వర్షా భావ పరిస్థితుల్లో తక్షణ చర్యలు చేపట్టాలన్న విజ్ఞప్తి**

2లో





## పెద్ది సుదర్శన్‌కు కేటీఆర్ నివాళి

- నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది పేరు
- కేటీఆర్ కీలక ప్రకటన
- పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ
- కేసీఆర్ రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

**నర్సంపేట, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):**
నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. సోమవారం నర్సంపేటలో నిర్వహించిన సంస్మరణ సభలో పాల్గొన్న కేటీఆర్, సుదర్శన్ రెడ్డి సేవలను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలకంగా పనిచేసిన గొప్ప నాయకుడిగా ఆయనను కొనియాడారు. నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. ప్రజల కోసం ఆయన చేసిన సేవలను చిరస్థాయిగా గుర్తుంచుకునేలా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. సుదర్శన్ రెడ్డి ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారని పేర్కొన్నారు.

మిగతా 2లో

## మత్స్యకారులకు బీమా భరోసా

- మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటన
- 4.21 లక్షల మందికి బీమా రక్షణ
- ప్రమాద మరణానికి రూ.5 లక్షలు
- బీమా ప్రీమియం ప్రభుత్వాల భరోసా



**హైదరాబాద్, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్రంలోని మత్స్యకారుల సామాజిక భద్రత, జీవనోపాధి రక్షణకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన వెల్లడించారు. ప్రమాదవశాత్తు మత్స్యకారులు మరణించినా, శాశ్వత వైకల్యానికి గురైనా వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా బీమా రక్షణ కల్పించడమే పథకం ప్రధాన ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల నమోదిత మత్స్యకారులందరూ ఈ పథకం పరిధిలోకి వస్తారని తెలిపారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మత్స్యకారుల కుటుంబాలకు సామాజిక భద్రత మరింత బలోపేతం కానుందని చెప్పారు.
ఒక్కో లబ్ధిదారునికి రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వరుణదేవునికి సీఎం ప్రత్యేక పూజలు

(మొదటి పేజీ తరువాయి)

108 మంది రుత్వికులు 11 హోమగుండాల వద్ద ప్రత్యేక హోమాలు నిర్వహించారు. వరుణదేవుని అనుగ్రహం కోసం వైదిక పద్ధతిలో యజ్ఞక్రతువులు చేపట్టి రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగాలని ప్రార్ధనలు చేశారు. ఈ యాగంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ మహా వరుణయాగాన్ని నిర్వహించింది. వర్షాలపై ఆధారపడిన వ్యవసాయ రంగానికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవాలని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ సహా అన్ని ప్రధాన జలాశయాలు నిండాలని, చెరువులు, కుంటలు జలకళతో కళకళలాడాలని ఆకాంక్షించారు. భూగర్భ జలాలు పెరిగి రైతులకు సాగునీటి కొరత లేకుండా ఉండాలని కోరుకున్నారు.

భారతీయ సంస్కృతిలో ప్రకృతిని ఆరాధిస్తూ యాగాలు, యజ్ఞాలు నిర్వహించడం శతాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయమని ఈ సందర్భంగా ప్రస్తావించారు. శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికలతో పాటు ప్రకృతి పట్ల గౌరవాన్ని వ్యక్తం చేసే ఆధ్యాత్మిక సంప్రదాయాలను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. ప్రకృతి, వ్యవసాయం, మానవ జీవనం పరస్పర సంబంధాలను గుర్తుచేసే కార్యక్రమంగా వరుణయాగాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, పి. సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రం సస్యశ్యామలంగా మారాలని, రైతుల ముఖాల్లో చిరునవ్వులు విరియాలని ఆకాంక్షిస్తూ మహా వరుణయాగం భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా పూర్తయింది.





# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కార్యక్రమంలో రాజకీయ వేడి

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం అసలు ఉద్దేశాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం అమలులో గత ప్రభుత్వ పాత్రను గుర్తించాలని ఆయన అన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ రంగు పులమకుండా నిర్వహిస్తే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. సంక్షేమ కార్యక్రమాలను రాజకీయ వేదికలుగా మార్చడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజల దృష్టి ప్రధానంగా ఇళ్ల పంపిణీపై ఉండగా, రాజకీయ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయని స్థానిక వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా జరిగిన వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ ప్రసంగాల అవసరంపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని పాడి కౌశిక్ రెడ్డి కోరారు. ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, అమలవుతున్న పథకాల గురించి స్పష్టమైన సమాచారం అందించడం ముఖ్యమని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారిస్తేనే ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# కాళేశ్వరం మోటార్లు వెంటనే ప్రారంభించాలి

హైదరాబాద్, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు): కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను వెంటనే నింపేందుకు మోటార్లను ప్రారంభించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకుని తక్షణమే నీటి పంపింగ్ చేపట్టాలని ఆయన కోరారు. ప్రస్తుతం వానాకాలం సాగు సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తగినంత వర్షపాతం లేకపోవడం, మరోవైపు రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నిల్వ చేయకపోవడంతో సాగు పనులు ముందుకు సాగడం లేదని లేఖలో వివరించారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, నృసింహ (బస్వాపూర్) రిజర్వాయర్లను నింపితే సుమారు నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉందని హరీష్ రావు తెలిపారు. మిడ్ మానేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం గణనీయమైన నీటి నిల్వలు ఉన్నాయని, వాటిని వినియోగించి వెంటనే నీటి పంపింగ్ ప్రారంభించాలని సూచించారు.

హరీష్‌రావు ప్రస్తావించిన నీటి లభ్యత

మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టీఎంసీలు కాగా ప్రస్తుతం సుమారు 22 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని హరీష్ రావు పేర్కొన్నారు. అలాగే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపాలని కోరారు.

రైతుల ఆందోళనపై ఆవేదన

గత యాసంగి సీజన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టులో నాలుగు లక్షల ఎకరాలకు పైగా సాగు జరిగిన విషయాన్ని గుర్తుచేసిన హరీష్ రావు, ప్రస్తుత వానాకాలంతో పాటు రానున్న యాసంగి పంటలకు కూడా నీటి కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. రిజర్వాయర్లతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న కాలువలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లను నింపడం ద్వారా రైతులకు భరోసా కల్పించాలని అన్నారు.

లోయర్ మానేరు డ్యామ్ పూర్తి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని లేఖలో పేర్కొన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని తరలించి ఎస్సారెస్పీ రెండో దశ పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించాలని సూచించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఆలస్యం చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను ప్రారంభించి నీటి పంపింగ్ చేపట్టాలని హరీష్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.



# మత్స్యకారులకు బీమా భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ప్రీమియం మొత్తాన్ని భరిస్తాయని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21,34,79,673 చెల్లించనుందని తెలిపారు. దీంతో అర్హులైన మత్స్యకారులపై బీమా ప్రీమియం రూపంలో ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు. బీమా పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందనుంది. శాశ్వత సంపూర్ణ వైకల్యానికి కూడా రూ.5 లక్షలు, శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షల బీమా రక్షణ లభించనుంది. ప్రమాదం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందిన సందర్భంలో గరిష్ఠంగా రూ.25 వేల వరకు వైద్య సహాయం అందించే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. 2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే బీమా కాలంలో అర్హులైన ప్రతి నమోదిత మత్స్యకారుడికి నిరంతర బీమా రక్షణ అందేలా మత్స్యశాఖ చర్యలు చేపట్టిందని వాకిటి శ్రీహరి వెల్లడించారు. పథకం అమలులో ఎలాంటి జాప్యం లేకుండా అర్హులైన వారందరికీ ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాద సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో గ్రూప్ ప్రమాద బీమా పథకం కీలకమైనదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులు, వారి కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత, ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని వాకిటి శ్రీహరి తెలిపారు.





# పెద్ది సుదర్శన్‌కు కేటీఆర్ నివాళి

(మొదటి పేజీ తరువాయి)

ఎంతకాలం జీవించామన్నది కాదని, ఎలా జీవించామన్నదే ముఖ్యమని కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల కోసం అంకితభావంతో పనిచేశారని, ఆయన అంత్యక్రియలకు తరలివచ్చిన భారీ జనసందోహమే ప్రజల్లో ఆయనకున్న అభిమానానికి నిదర్శనమని చెప్పారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సుదర్శన్ రెడ్డి అత్యంత సన్నిహితంగా పనిచేశారని కేటీఆర్ గుర్తుచేశారు. జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన వివిధ బాధ్యతలు నిర్వహించారు. 2018 నుంచి 2023 వరకు నర్సంపేట ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారు. గత నెల 31న గుండెపోటుతో పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందారు. ఆయన మరణంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నర్సంపేటలోని సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల పేరున ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున, ఆయన తల్లి సంక్షేమం కోసం రూ.25 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి సుదర్శన్ రెడ్డి పేరు పెట్టాలన్న కేటీఆర్ ప్రకటనతో ఆయన సేవలకు గౌరవం లభించినట్లయిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

# అనుమతుల్లేకుండా ఇసుక తరలింపు.. ఐదు ట్రాక్టర్లపై కేసులు



- **పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి**

**పెద్దమందడి,ఆగస్టు10(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల పరిధిలోని చిలుకుటోనిపల్లి వాగు నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి తెలిపారు.ఎస్సై వివరాల ప్రకారం..ఆదివారం రాత్రి కొత్తకోట మండలం కన్నిమేట గ్రామానికి చెందిన ఐదు ఇసుక ట్రాక్టర్లు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చిలుకుటోనిపల్లి వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని పెద్దమందడి పోచం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సంబంధిత ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై జలంధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు.

# విమలక్క 50 ఏళ్ల ప్రజా సంస్కృతిక ఉద్యమం

- **50 గంటల పాటు ఆట.. పాట.. మాటల ప్రస్థానం**
- **సెప్టెంబర్ 26న ఉదయం పది గంటల నుంచి ప్రజా కళా జాతర ప్రారంభం**
- **విలేకరుల సమావేశంలో విమలక్క**




**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 10(తెలంగాణ ముచ్చట్లు ):**అరుణోదయ విమలక్క 50 ఏళ్ల ప్రజా సంస్కృతిక ప్రస్థానాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 26న ఉదయం పదిగంటల నుంచి సెప్టెంబర్ 28 మధ్యాహ్నం 12: గంటల వరకు ఏకధాటిగా 50గంటల పాటు ఆట.. పాట.. మాటలతో ప్రజా కళా జాతర కార్యక్రమం హైదరాబాదులో నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క వెల్లడించారు.
ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విప్లవోద్యమాల నుండే విప్లవకారులు పుడతారు. ప్రజా ఉద్యమాల నుండి ప్రజా కళాకారులు ఉద్భవిస్తారు. తన జీవితకాలం విప్లవ ప్రజా సంస్కృతిక ఉద్యమాలలో 50 ఏళ్ల మైలురాయిని అధిగమించిన తన ప్రస్థానంలో 50 గంటల పాటు ఏకధాటిగా ఆట,పాట, మాటలతో ప్రజాకళ జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
బహుళ ప్రజా కళలు, జానపద కళారూపాలు , ప్రజా కళా జాతర, మనువాదంగా సంస్కృతి మూఢత్వమై, సామ్రాజ్యవాద సంస్కృతి సాగుతున్న దాడికి ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి నిర్మాణంలో భాగమై సంస్థలను, శక్తులను, వ్యక్తులందరినీ సాదరంగా ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. విమలక్క ఒక వ్యక్తి కాదు అని, సామూహిక శక్తి అని 1974 ఆగస్టులో అరుణోదయ సంస్కృతిక సమైక్య ఉస్మానియాలో పురుడు పోసుకునేటప్పటికీ బాల గాయనిగా వెలుగులోకి వచ్చిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని అన్నారు. అనేక కష్ట నష్టాలను ఎదుర్కొని జైలు జీవితాన్ని అనుభవించి ప్రజా ఉద్యమాలే ఆయుధంగా ఎంచుకొని అరుణోదయ సంస్కృతిక విప్లవంలో పాటల ప్రస్థానం ఒక మరుపురాని ఘట్టం అన్నారు. తన జీవితం ప్రజలకు అంకితంగా భావిస్తూ తన స్వభావం కలిగిన కార్యకర్తలను కళాకారులను ప్రేమ పూర్వకంగా 50 గంటల పాటు సాగే ప్రజా కల జాతర నిర్వహణలో స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విమలక్క పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో అరుణోదయ సంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, వర్ష సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, టిపి జెఎసి జిల్లా కన్వీనర్ విజయ్, అరుణోదయ సంస్కృతిక సమైక్య సహకార దర్శి రాకేష్, ఉపాధ్యక్షులు అనిత తదితరులు పాల్గొన్నారు.


# సవాల్ విసిరితే బీఆర్ఎస్ నాయకులు ఎక్కడ?



- **బుద్ధారం వద్దకు వచ్చి నీటి ప్రవాహాన్ని కళ్లారా చూడాలి**
- **కొత్త కాపు వెంకటేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు**

**పెద్దమందడి,ఆగస్టు10(తెలంగాణ ముచ్చట్లు):** శ్రీశైలం-కేఎల్ఐ ద్వారా నీళ్లు రావడం లేదంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారంపై పెద్దమందడి-ఖిల్లా ఘనపూర్ మండలాల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతులు, ప్రజలను గందరగోళానికి గురిచేసేలా తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు.కేఎల్ఐ నీటి ప్రవాహంపై వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు బీఆర్ఎస్ నాయకులను బహిరంగంగా సవాల్ చేసినట్లు వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. బుద్ధారం గండి లేదా చెరువు వద్దకు వచ్చి నీటి ప్రవాహాన్ని కళ్లారా పరిశీలించాలని కోరినా ఇప్పటివరకు వారి నుంచి స్పందన లేదన్నారు. నీళ్లు రావడం లేదంటూ ఆరోపణలు చేస్తున్న నాయకులు క్షేత్రస్థాయికి వచ్చి వాస్తవాలను పరిశీలించేందుకు ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు.కేవలం ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపణలు చేయడం కాకుండా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వాస్తవాలను తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేయడం వల్ల రైతుల్లో అనవసరమైన ఆందోళన, గందరగోళం ఏర్పడుతుందని అన్నారు.ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నారని వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. నీటి విషయంలో ఎవరికైనా అనుమానాలు ఉంటే బుద్ధారం ప్రాంతానికి వచ్చి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించాలని, తప్పుడు ప్రచారంతో రైతులను గందరగోళానికి గురిచేయవద్దని సూచించారు .ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కాలనీ ఫేస్-1లో ఘనంగా బోనాల సంబరాలు



**జవహర్‌నగర్, ఆగస్టు 10 ( తెలంగాణ ముచ్చట్లు):** జవహర్‌నగర్ చంద్రపురి కాలనీ డివిజన్2 పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కాలనీ ఫేస్1లో ఆషాఢ మాస బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కాలనీ ఫేస్1 వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.
వేడుకల్లో భాగంగా కాలనీ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలతో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కాలనీ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి కాలనీ వ్యవస్థాపకుడు మంద లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బుడిద వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.సి. శ్రీకాంత్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆషాఢ మాస బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని తెలిపారు. ఇలాంటి పండుగలను సామూహికంగా నిర్వహించుకోవడం ద్వారా కాలనీవాసుల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఎం. లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రెటరీ కుమ్మరి కృష్ణ, కోశాధికారి కత్తర్ల కిరణ్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు మూకర రవి, రంగుల హరికృష్ణ, ఉపాధ్యక్షుడు రంగుల శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటగిరి సంతోష్ కుమార్, కార్యదర్శులు గరడ్ మహిపత్రావు దత్త, చిక్క రఘు, కెమ్మసరం నగేష్, సహాయ కార్యదర్శులు కెమ్మసరం సుజాత, టి. సుజాత, సుమతి, గౌరవ సలహాదారులు సిల్వేరి శ్రీకాంత్, కెమ్మసరం చంద్రయ్య, పండుగ సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు సి.హెచ్. బస్వరాజు, ఎం. వంశీ, వై. మహేందర్, చట్టు చిరంజీవి, తన్నీరు నాగరాజు, కుంచాల నవీన్ కుమార్, మిత్రా గౌతమ్, ఏ. నాగచారి, ఆర్. చిత్తారి తదితరులు పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు. భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ బోనాల వేడుకలు కాలనీలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.

# తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల గుర్తింపును వేగవంతం చేయండి

- **డాక్టర్ పిడమర్తి రవి , డాక్టర్ కె.వి కృష్ణారావు**




**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 10(తెలంగాణ ముచ్చట్లు ):** రెండు తరాల తెలంగాణ ఉద్యమాకారులను సుమారుగా లక్ష మందిని గుర్తించండి కాంగ్రెస్ మళ్ళీ గెలుస్తుందని , అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల గుర్తింపును వేగవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ పిడమర్తి రవి , డాక్టర్ కె.వి కృష్ణారావు అన్నారు . చిన్నారి హాస్పిటల్ డైరెక్టర్ ఆఫీస్ లో రెండు తరాల తెలంగాణ ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనం కరపత్రాన్ని జమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి , తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ కె.వి కృష్ణారావు మరియు మిగతా నాయకులతో కలిసి ఆవిష్కరించారు . తెలంగాణ రాష్ట్రంలో అమరవీరుల కుటుంబాలు ఉద్యమంలో గాయపడిన వారు ఆగిపోయింది జైలుకుపోయిన వారు ఉద్యమం నడిపిన వారు సంఘాలు ఏర్పాటు చేసిన వాళ్లు అందరిని కలిపి లక్ష మందిని గుర్తించాలని వారికి 250 చదరపు గజాల స్థలం మరియు పెన్షన్ , గుర్తింపు కార్డులు ఇవ్వాలని పిడమర్తి రవి కోరారు . సెప్టెంబర్ 16న హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే అపూర్వ సమ్మేళనానికి 1969 2009 ఉద్యమకారులు హాజరుకావాలని కోరారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దేవి రెడ్డి విజయ్ , మట్టి గురుమూర్తి , జిల్లా విజయ్ , రాకేష్ , భూక్య హరినాయక్ తదితరులు పాల్గొన్నారు .

# రైతుకు నీళ్లు ఇస్తే స్వాగతిస్తాం.. ఇవ్వకపోతే ఉద్యమిస్తాం

- **బీఆర్ఎస్ పోరాటంతోనే కాంగ్రెస్ మేల్కొంది**
- **అల్వాల వెంకటరెడ్డి, పెద్దమందడి బీఆర్ఎస్ నాయకులు**

**పెద్దమందడి,ఆగస్టు10(తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు సాగునీరు అందించాలన్న బీఆర్ఎస్ పోరాటం, హెచ్చరికలతోనే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం నీటిని విడుదల చేసిందని వనపర్తి జిల్లా పెద్దమందడి బీఆర్ఎస్ నాయకుడు అల్వాల వెంకటరెడ్డి అన్నారు. రైతులకు సాగునీరు అందించడం మంచి పరిణామమని, దీనిని బీఆర్ఎస్ స్వాగతిస్తుందని స్పష్టం చేశారు. వర్షాకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడిచిన తర్వాత బీఆర్ఎస్ రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో ఇప్పుడు సాగునీరు విడుదల చేశారని ఆయన అన్నారు. నీటిని విడుదల చేసిన విషయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ముందుగానే రైతుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అధికార పార్టీపై లేదా అని సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు.బీఆర్ఎస్ పోరాటం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయడం చూస్తుంటే రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని విమర్శించారు. సాగునీరు విడుదల చేసిన అనంతరం కాంగ్రెస్ నాయకులు ఫోటోలకు ఫోజులిస్తూ తామేదో ఘనకార్యం సాధించినట్లు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నీళ్లు వదిలాం.. ఇదిగో ఫోటోలు చూడండి అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకోవడం కాదని, విడుదల చేసిన నీరు నిజంగా రైతుల పొలాలకు చేరిందా లేదా అనేదే ముఖ్యమని అల్వాల వెంకటరెడ్డి అన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలపై బీఆర్ఎస్‌ను పక్కదారి పట్టించే పార్టీగా చిత్రీకరించేందుకు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను ఆయన ఖండించారు. రైతుల సాగునీటి సమస్యపై బీఆర్ఎస్ మొదటి నుంచి స్పష్టమైన వైఖరితో ఉందని తెలిపారు. రైతుకు నీరు అందిస్తే స్వాగతిస్తాం.. నీరు అందించకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తాం అనేదే తమ పార్టీ వైఖరి అని స్పష్టం చేశారు. రైతుకు సాగునీరు అందితే తమకు సంతోషమేనని, నీళ్లు ఎవరు ఇచ్చారన్నది కాదని.. రైతు పొలానికి నీరు చేరిందా లేదా అన్నదే ప్రధానమని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఫోటోలు, ప్రచారాలకే పరిమితం కాకుండా రైతుల ప్రయోజనాలపై దృష్టి పెట్టాలని సూచించారు.ప్రభుత్వం ఇకపై సాగునీటి విషయంలో నిర్లక్ష్యం చేయకుండా, కాలువల చివరి ఆయకట్టు వరకు నీరు సక్రమంగా చేరేలా పర్యవేక్షించాలని అల్వాల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



- బీజేపీ మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య

**పెద్దమందడి,ఆగస్టు10(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో బీజేపీ పెద్దమందడి మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి భారతీయుడు తమ ఇంటిపై కుటుంబ సభ్యులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు.దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటేలా ప్రతి కుటుంబం జాతీయ జెండాను గౌరవంగా తమ ఇంటిపై ఎగురవేయాలని చెన్నయ్య కోరారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ జెండా పట్ల గౌరవాన్ని చాటాలని అన్నారు.ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశభక్తి భావనను ప్రతి కుటుంబంలో పెంపొందించడంతో పాటు యువతలో జాతీయ స్ఫూర్తిని నింపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



## కేంద్ర విధానాలపై ప్రజా సంఘాల పోరుబాట

- ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జమ్మికుంటలో జైల్‌భరో

**జమ్మికుంట, టౌన్ ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జమ్మికుంట పట్టణంలోని గాంధీచౌక్‌లో రాస్తారోకో, జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి జక్కుల రమేష్‌యాదవ్, రైతు సంఘం మండల కార్యదర్శి కాయిత లింగారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు పన్నెండేళ్లు గడిచినా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు.

కార్మికుల హక్కులను కాలరాసే విధంగా గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చారని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేటు సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను హరించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధానాలను కేంద్రం అవలంబిస్తోందని నాయకులు ఆరోపించారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు సుదీర్ఘకాలం ఉద్యమించిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి చేయడంతోపాటు యూరియా, డీఏపీ కొరత, ధరల పెరుగుదలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేద రైతులు, వ్యవసాయ కార్మికులకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కొత్త విధానంతో రాష్ట్రాలపై అధిక ఆర్థిక భారం మోపుతున్నారని, దీంతో పేదలు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం ప్రయోజనాలు దూరమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

దేశంలోని సంపన్న వర్గాలు, కార్పొరేట్ సంస్థలకు భారీ రాయితీలు కల్పిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకుని రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా మరింత విస్తృతమైన నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు దండిగారి సతీష్, కేవీపీఎస్ నాయకుడు వడ్లూరి కిషోర్, సీఐటీయూ నాయకులు కన్నం సదానందం, గారే రాజకుమారి, రావుల ఓదెలు, క్రాంతి కుమార్, రాచపల్లి తిరుపతి, తాటికంటి రంజిత్, తూర్పాటి నాగరాజు, జీడి సదానందం తదితరులు పాల్గొన్నారు.



# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి






- పారా–3 రద్దు చేయాలని డిమాండ్.. వనపర్తిలో బ్లాక్ డే ర్యాలీ

**వనపర్తి,ఆగస్టు10(తెలంగాణ ముచ్చట్లు):** 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల్లోని పారా-3ను రద్దు చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ రాజ్యాంగ హక్కుల సాధన సమితి వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బ్లాక్ డే నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి రాజీవ్ చౌక్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.కార్యక్రమానికి జిల్లా కోఆర్డినేటర్ గొర్ల కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు గంధం భగత్, సీపీఎం జిల్లా అధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు, సామాజిక నేత గంధం నాగరాజు మాట్లాడుతూ.. పారా-3 దళిత క్రైస్తవుల రాజ్యాంగ హక్కులకు అడ్డంకిగా ఉందన్నారు. సిక్కు, బౌద్ధ దళితులకు ఎస్సీ హోదా కల్పించిన విధంగానే దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. హక్కులు సాధించే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. థామస్ బెంజమిన్, పాస్టర్ డేవిడ్ ఇమ్మానియేల్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు విశ్వం బాబు, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సీపీఐ జిల్లా అధ్యక్షుడు రమేష్, వార్డు కౌన్సిలర్ మదన్, భారత్ సేవా టీం బాల గోవింద్, కేవీన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వీరపోగు గోవింద్, ఐద్వా అధ్యక్షురాలు లక్ష్మీ, యాకోబు విజయ కుమార్, ఏ. రంజిత్, పి. భాస్కర్, ప్రసాద్, పాస్టర్ లాజర్స్, యుగేందర్, వేణు జనార్దన్, మనోహర్, అమర్, పాస్టర్ అనిల్ కుమార్, గొర్ల అనిల్ కుమార్, కె.జె.ఎస్. సామేలు, గంధం పరంజ్యోతి, రంగస్వామి, మన్మోహన్, రవి, శ్రీను, అజయ్ మాదిగ, చెన్నయ్య మాదిగ, వేదాంత్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో క్రిస్టియన్ పాస్టర్లు, దళిత క్రైస్తవులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# అర్చకుల సంక్షేమానికి అంకితమైన నాయకత్వం



- రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సదానిరంజన్ సిద్ధాంతికి ఘన సన్మానం

**ఎల్కతుర్తి , ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామానికి చెందిన సదానిరంజన్ సిద్ధాంతిని హనుమకొండ జంగమ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.సదానిరంజన్ సిద్ధాంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికకావడం వీరశైవ జంగమ అర్చక పురోహితుల ఐక్యతకు నిదర్శనమని జంగమ సమాజం సభ్యులు పేర్కొన్నారు. అర్చకుల సమస్యల పరిష్కారం, వారి హక్కులు, సంక్షేమం, గౌరవం కోసం ఆయన మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని జంగమ ధూప దీప నైవేద్య అర్చకులను సంఘటితం చేసి, వారి సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా అర్చకులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, సౌకర్యాలు, హక్కులు సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని సూచించారు. అర్చక వృత్తి గౌరవాన్ని మరింత పెంచే విధంగా సంఘాన్ని ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘం నాయకులు, అర్చక పురోహితులు, జంగమ సమాజం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ రాష్ట్రంలోని వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చకుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అర్చక పురోహితుల ఐక్యతే సంఘం బలోపేతానికి ప్రధానమని, అందరి సహకారంతో సంఘాన్ని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.కార్యక్రమంలో హనుమకొండ జంగమ సమాజం అధ్యక్షులు గురుమూర్తి గురుదత్త, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్‌బాబు, మాజీ కౌన్సిలర్ శివకుమార్, మఠం రాజేష్ కుమార్, భద్ర దేవ్, చరణ్, శివప్రసాద్, మహిళా సభ్యులు ఉమాదేవి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి పేద బిడ్డకు నాణ్యమైన విద్యే ధ్యేయం

- రూ.3.25 కోట్లతో ఎల్కతుర్తి కేజీబీవీ నూతన భవనం ప్రారంభం

**ఎల్కతుర్తి, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):** పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ పేదల పక్షపాతిగా పనిచేస్తోందని తెలిపారు.

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో రూ.3.25 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) నూతన భవనాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, వసతి గృహాల్లో చదువుతున్న బాలికల కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు పేర్కొన్నారు.ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల చొప్పున కేటాయించి సుమారు 3,500 మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తే వారు తమ కాళ్లపై తాము నిలబడటమే కాకుండా మరెందరికో ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతారని అన్నారు. విద్య, వైద్యం పేదల జీవితాలకు రెండు కళ్ల వంటివని, ఈ రంగాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రిల్స్, ప్రహరీ తదితర అవసరమైన పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**విద్యకు అత్యధిక ప్రాధాన్యత : మంత్రి పొన్నం ప్రభాకర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు నూతన భవనాలు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాలు, పదోన్నతులు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

నాణ్యమైన విద్యే భవిష్యత్ తెలంగాణ నిర్మాణానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా నైపుణ్యాలు, వృత్తిపరమైన సామర్థ్యాలను పెంపొందించుకునేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

**కేజీబీవీల్లో మెరుగైన వసతులు : కలెక్టర్**

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఎల్కతుర్తి కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. నాబార్డు నిధులతో అదనపు మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని కేజీబీవీలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయడంతో పాటు అదనపు తరగతి గదులు, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు నూతన యూనిఫాంలు, ట్రంక్ బాక్సులు, ఇతర అవసరమైన సామగ్రిని ఇప్పటికే అందజేశామని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రులు విద్యార్థినులకు బ్లాంకెట్లు, ట్రంక్ బాక్సులు, కార్పెట్లు, ఇతర సామగ్రిని అందజేశారు. నూతన భవనంలోని వసతులను పరిశీలించి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంత్రులు ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఈఓ గిరిరాజ్ గౌడ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ అనితాదేవి, వివిధ శాఖల అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తగ్గిన బంగారం ధరలు.. కొనుగోలుదారులకు ఊరట!



**హైదరాబాద్, ఆగస్టు 10, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** గత కొద్దిరోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు సోమవారం స్వల్పంగా బ్రేక్ పడింది. దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.380, 22 క్యారెట్ల బంగారంపై రూ.350, 18 క్యారెట్ల బంగారంపై రూ.280 చొప్పున తగ్గింది.

ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,970గా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం రూ.1,39,300 వద్ద, 18 క్యారెట్ల బంగారం రూ.1,13,980 వద్ద కొనసాగుతోంది.

తెలంగాణలో ధరలు

వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,970గా ఉంది. 22 క్యారెట్ల ధర రూ.1,39,300 కాగా.. 18 క్యారెట్ల ధర రూ.1,13,980గా నమోదైంది.

ఆంధ్రప్రదేశ్‌లోని కడప, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,970గా ఉంది. 22 క్యారెట్ల బంగారం రూ.1,39,300, 18 క్యారెట్ల బంగారం రూ.1,13,980 వద్ద ట్రేడవుతోంది.

ప్రధాన నగరాల్లో బంగారం ధరలు

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రూ.1,52,180, 22 క్యారెట్ల బంగారం రూ.1,39,500, 18 క్యారెట్ల బంగారం రూ.1,17,650గా ఉంది.

ముంబై, కోల్‌కతా, బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,51,970, 22 క్యారెట్ల ధర రూ.1,39,300, 18 క్యారెట్ల ధర రూ.1,13,980గా నమోదైంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ.1,52,120, 22 క్యారెట్ల ధర రూ.1,39,450, 18 క్యారెట్ల ధర రూ.1,14,130గా ఉంది.

వడోదరా, ఇండోర్‌లో 24 క్యారెట్ల ధర రూ.1,52,020, 22 క్యారెట్ల ధర రూ.1,39,350, 18 క్యారెట్ల ధర రూ.1,14,030గా కొనసాగుతోంది.

కాన్పూర్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,52,120, 22 క్యారెట్ల ధర రూ.1,39,450, 18 క్యారెట్ల ధర రూ.1,14,130గా నమోదైంది.

బంగారం ధరలు నగరాన్ని బట్టి స్వల్పంగా మారవచ్చు. ఆభరణాల కొనుగోలు సమయంలో తయారీ ఛార్జీలు, పన్నులు అదనంగా వర్తించే అవకాశం ఉంటుంది.

# ఎలాన్ మస్క్ సంపదకు రెక్కలు.. రోజుకు రూ.8,300 కోట్లు!



**న్యూఢిల్లీ ఆగస్టు 10, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా కొనసాగుతున్న ఎలాన్ మస్క్ సంపద గత ఏడాది కాలంలో అసాధారణంగా పెరిగింది. 2025 జులై నుంచి 2026 జులై మధ్య ఆయన సంపద ఏకంగా 319.5 బిలియన్ డాలర్లు పెరిగినట్లు ఓ నివేదిక వెల్లడించింది. అంటే సగటున రోజుకు సుమారు 875 మిలియన్ డాలర్లు.. భారత కరెన్సీలో దాదాపు రూ.8,300 కోట్ల చొప్పున ఆయన సంపద పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఎలాన్ మస్క్ సంపద ప్రధానంగా టెస్లా, స్పేస్ఎక్స్ వంటి సంస్థల్లో ఆయనకు ఉన్న వాటాల విలువతో ముడిపడి ఉంటుంది. గత ఏడాది కాలంలో ఈ కంపెనీల మార్కెట్ విలువలు గణనీయంగా పెరగడంతో మస్క్ నికర సంపద కూడా వేగంగా పెరిగింది. ముఖ్యంగా స్పేస్ఎక్స్ ప్రజా వాటాల విక్రయానికి సంబంధించిన అంచనాలకు మించిన డిమాండ్ ఆయన సంపదను సరికొత్త స్థాయికి తీసుకెళ్లినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

అయితే ఆ తర్వాత షేర్లపై అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మస్క్ సంపదలో కొంత మేర తగ్గుదల కూడా నమోదైంది. అయినప్పటికీ ప్రపంచ కుబేరుల జాబితాలో ఆయన అగ్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

మస్క్ తర్వాత డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ మైఖేల్ డెల్ అత్యధికంగా సంపదను పెంచుకున్న వ్యక్తిగా నిలిచారు. 2025 జులై నుంచి 2026 జులై మధ్య ఆయన సంపదకు 107.6 బిలియన్ డాలర్లు అదనంగా చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి.

# బంగారం సుంకంతో కేంద్రానికి భారీ ఆదాయం

**న్యూఢిల్లీ ఆగస్టు 10, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** బంగారం దిగుమతులపై సుంకాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఖజానాకు భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. మే 13 నుంచి ఆగస్టు 2 వరకు కేవలం మూడు నెలల్లోనే రూ.10,463 కోట్ల కస్టమ్స్ ఆదాయం సమకూరినట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించింది. బంగారం, వెండి, ప్లాటినం దిగుమతులపై కేంద్రం మే 13న సుంకాన్ని పెంచింది.

మే 13 నుంచి ఆగస్టు 2 వరకు ఈ విలువైన లోహాల దిగుమతులపై వసూలైన సుంకం ద్వారా రూ.10 వేల కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఇందులో ప్రధాన వాటా బంగారం దిగుమతులదే. ప్రపంచ మార్కెట్లలో బంగారం ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో దిగుమతుల విలువ కూడా గణనీయంగా పెరిగింది. ఇదే సమయంలో అక్రమంగా తరలిస్తున్న బంగారంపై అధికారులు చర్యలు చేపట్టారు. ఈ కాలంలో 161 కిలోల అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది.

గత మూడు నెలల్లో బంగారం దిగుమతుల పరిమాణం మాత్రం పెరగలేదు. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పెరగడం, దిగుమతులపై సుంకాల పెంపు కారణంగానే ఈ స్థాయిలో ఆదాయం సమకూరినట్లు కేంద్రం వెల్లడించింది. 2025 26 ఆర్థిక సంవత్సరంలో భారత బంగారం దిగుమతుల విలువ దాదాపు 71.97 బిలియన్ డాలర్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి.

# కనపర్తిలో కాంగ్రెస్ బలోపేతానికి కొత్త కమిటీ

- **అధ్యక్షుడిగా అల్లంరెడ్డి శ్రీనివాసరెడ్డి**



**వీణవంక, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):** వీణవంక మండలం కనపర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకు పార్టీ నాయకత్వం నూతన కమిటీని ఎన్నుకుంది.గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అల్లంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పులి మదనయ్య, ప్రధాన కార్యదర్శిగా అనుమాండ్ల గోపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఎన్నికతో గ్రామంలో పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. పార్టీపై విశ్వాసంతో ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

# పేదల అభ్యున్నతికి రవీందర్ రావు సేవలు అభినందనీయం

- **అంబేద్కర్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్ వర్ధినేని రవీందర్ రావుకు ఘన సన్మానం**



**హుజురాబాద్, ఆగస్టు 10(తెలంగాణ ముచ్చట్లు ):** పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సేవలందిస్తూ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్ రావును అంబేద్కర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీసీ ఆజాద్ ఫెడరేషన్, ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్, చేనేత తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాదుగుల ఓదెలు మాట్లాడుతూ.. బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూచించిన 'పే బ్యాక్ టు ది సొసైటీ' సిద్ధాంతాన్ని స్ఫూర్తిగా తీసుకుని రవీందర్ రావు అనేక మంది పేదవర్గాల పిల్లలకు విద్య, ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. సమాజానికి తన వంతు బాధ్యతగా సేవ చేయడం ద్వారా ఎంతోమందికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటి, పర్యావరణ సమతుల్యత కోసం రవీందర్ రావు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. పేద, బడుగు వర్గాల పిల్లల భవిష్యత్ అభివృద్ధికి ఆయన సేవలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి సమ్మయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షులు రామగిరి అంకుస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వంతడుగుల బాబు, బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకమూరి శ్రీనివాస్, పద్మశాలి సంఘం నాయకులు సంజు సత్యనారాయణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తడికమళ్ళ శేఖర్, బీసీ సంక్షేమ సంఘం మహిళా జనరల్ సెక్రెటరీ ప్రియదర్శిని, ఆర్టీఐ చట్టం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లూరు రాజేందర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రుద్రారపు రామచంద్రం, శ్రీనివాస్, వసంత్, తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు తునికి సమ్మయ్య, తెలంగాణ పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంఘం సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు కొలిపాక క్రాంతి కుమార్, బీసీ ఆజాద్ ఫెడరేషన్ మండల ప్రధాన కార్యదర్శి మామూరి ప్రవీణ్, చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షురాలు బింగి రాణి, సృజన, చల్లూరు నిరోషా, షాదిక్‌తో పాటు అభిమానులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇళ్ల కలకు ఆర్బీఐ బూస్ట్.. రూ.3 కోట్ల వరకు గృహ రుణాలు!




**ముంబయి, ఆగస్టు 10, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** సామాన్యుల సొంతింటి కలను సాకారం చేసేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ సహకార బ్యాంకుల్లో గృహ రుణాల నిబంధనలను సులభతరం చేస్తూ కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మరింత ఎక్కువ మొత్తంలో గృహ రుణాలు పొందే అవకాశం కలగనుంది. ఇన్నాళ్లూ రుణ పరిమితి తక్కువగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొన్న మధ్యతరగతి కుటుంబాలకు ఈ నిర్ణయం ఊరటనిచ్చే అంశంగా మారింది.

డిపాజిట్ల ఆధారంగా రుణ పరిమితి పెంపు

గ్రామీణ సహకార బ్యాంకుల్లో డిపాజిట్ల పరిమాణాన్ని బట్టి గృహ రుణాల పరిమితిని గణనీయంగా పెంచారు. తాజా మార్గదర్శకాల ప్రకారం రూ.60 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.3 కోట్ల వరకు గృహ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. రూ.1,000 కోట్లకు పైగా డిపాజిట్లు కలిగిన బ్యాంకులు తమ పరిధిలోని అర్హులైన ఖాతాదారులకు గరిష్ఠంగా రూ.3 కోట్ల వరకు గృహ రుణం మంజూరు చేయవచ్చు.

20 ఏళ్ల కాలపరిమితి.. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు వెసులుబాటు

పెద్ద మొత్తంలో రుణం తీసుకునే వారికి తిరిగి చెల్లించేందుకు తగిన సమయం కూడా కల్పించారు. రూ.1,000 కోట్లకు పైగా డిపాజిట్లు కలిగిన గ్రామీణ సహకార బ్యాంకుల నుంచి తీసుకునే గృహ రుణాలకు గరిష్ఠంగా 20 ఏళ్ల వరకు కాలపరిమితి ఉంటుంది.

అంతేకాకుండా నిర్మాణంలో ఉన్న ఇళ్ల కోసం ప్రత్యేకంగా 24 నెలల వరకు వాయిదా సౌకర్యాన్ని కూడా కల్పించారు. దీంతో ఇల్లు నిర్మించుకునే వారికి రుణ చెల్లింపుల విషయంలో కొంత ఆర్థిక వెసులుబాటు లభించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో సొంతింటి నిర్మాణాన్ని ప్రోత్సహించడంలో ఈ మార్గదర్శకాలు కీలకంగా మారే అవకాశం ఉంది.

# పెన్షనర్లకు భారీ ఊరట.. కనీస పెన్షన్ రూ.45 వేలు చేయాలని డిమాండ్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 10, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంఘాల కూటమి అయిన భారత్ పెన్షనర్ల సమాజ్ ప్రతినిధులు 8వ వేతన సంఘం అధికారులతో సమావేశమై కీలక ప్రతిపాదనలు, సిఫార్సులను అందించారు. బిపిఎస్ అధ్యక్షుడు ఆర్‌కే చౌహాన్, కార్యదర్శి జనరల్ అవినాష్ రాజ్‌పుత్ నేతృత్వంలోని బృందం న్యూఢిల్లీలో అధికారులతో చర్చలు జరిపింది.




కనీస పెన్షన్ రూ.45 వేలు చేయాలి

ప్రస్తుతం ఉన్న కనీస పెన్షన్ రూ.9,000ను ఐదు రెట్లు పెంచి రూ.45,000కు పెంచాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉద్యోగి పదవీ విరమణకు ముందు పొందిన చివరి ప్రాథమిక వేతనంలో 67 శాతాన్ని పెన్షన్‌గా, 50 శాతాన్ని కుటుంబ పెన్షన్‌గా చెల్లించాలని సూచించారు.

కనీస వేతనం రూ.69 వేలకు పెంపు

కనీస ప్రాథమిక వేతనాన్ని ప్రస్తుతం ఉన్న రూ.18,000 నుంచి రూ.69,000కు పెంచాలని కోరారు. ఇందుకోసం 3.83 గుణాంకాన్ని వర్తింపజేయాలని ప్రతిపాదించారు.

ప్రతి ఐదేళ్లకోసారి వేతనాల సవరణ

ప్రస్తుతం పదేళ్లకు ఒకసారి జరుగుతున్న వేతనాలు, పెన్షన్ల సవరణను ఇకపై ప్రతి ఐదేళ్లకోసారి చేపట్టాలని ప్రతినిధులు కోరారు. కరువు భత్యం, కరువు ఉపశమనాన్ని కూడా ఏడాదికి రెండుసార్లు కాకుండా ప్రతి మూడు నెలలకోసారి సవరించాలని సూచించారు.

పెన్షనర్లకు నెలకు రూ.5 వేల వైద్య భత్యం

గ్రామీణ, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం పరిధిలో లేని ప్రాంతాల్లో నివసించే పెన్షనర్లకు నగదురహిత వైద్య సదుపాయాలతో పాటు నెలకు రూ.5,000 స్థిర వైద్య భత్యం అందించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర భాగస్వామ్య వర్గాలతో 8వ వేతన సంఘం రెండో విడత చర్చలు కొనసాగిస్తోంది. అందుతున్న సూచనలు, ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం తుది సిఫార్సుల నివేదికను సిద్ధం చేసి కేంద్ర మంత్రివర్గం ఆమోదానికి పంపే అవకాశం ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# తిరంగాతో సీఐఎస్ఎఫ్ దేశభక్తి

- **సీఐఎస్ఎఫ్ సిబ్బంది జాతీయ జెండాతో కార్యక్రమాలు**
- **దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా సందడి**
- **ఐక్యతకు ప్రతీకగా జాతీయ పతాకం**
- **దేశభక్తి స్ఫూర్తిని చాటుతున్న సీఐఎస్ఎఫ్**

**న్యూఢిల్లీ, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా-2026 కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఆధ్వర్యంలో వివిధ దేశభక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశ జాతీయ పతాకమైన తిరంగాను గర్వంగా ప్రదర్శిస్తూ సీఐఎస్ఎఫ్ సిబ్బంది జాతీయ ఐక్యత, దేశభక్తి, జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని చాటుతున్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సీఐఎస్ఎఫ్‌కు చెందిన వివిధ విభాగాలు పలు కార్యక్రమాలను చేపడుతున్నాయి. సిబ్బంది జాతీయ జెండాలను చేతబూని ప్రజల్లో దేశభక్తి భావనను పెంపొందించేలా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జాతీయ పతాకాన్ని ప్రతి ఇంటిపై ఎగురవేయాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

దేశ స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ పతాకానికి గౌరవం ఇవ్వాలని సీఐఎస్ఎఫ్ పిలుపునిస్తోంది. తిరంగా దేశ ప్రజలందరినీ ఒకే భావనతో కలిపే ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. సీఐఎస్ఎఫ్ యూనిట్లలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జాతీయ జెండాను గౌరవంగా ప్రదర్శిస్తూ దేశం పట్ల తమ బాధ్యతను, జాతీయ ఐక్యత పట్ల తమ నిబద్ధతను చాటుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లోనూ దేశభక్తి స్ఫూర్తిని మరింత పెంచే ప్రయత్నం చేస్తున్నారు.

హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటా జాతీయ పతాకం రెపరెపలాడేలా ప్రజలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ సంస్థలు, భద్రతా బలగాలు విస్తృతంగా మద్దతు అందిస్తున్నాయి. ఇందులో భాగంగా సీఐఎస్ఎఫ్ కూడా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. జాతీయ జెండాపై గౌరవం, దేశంపై ప్రేమ, ప్రజల్లో ఐక్యత భావనను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని సీఐఎస్ఎఫ్ పేర్కొంది. హర్ ఘర్ తిరంగా-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. "ప్రతి ఇంటా తిరంగా.. ప్రతి హృదయంలో తిరంగా" అనే సందేశంతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.



# ఉపాధి గణాంకాలు విడుదల

- **ఉద్యోగ మార్కెట్‌పై తాజా నివేదిక**
- **ఏప్రిల్–జూన్‌లో శ్రమ భాగస్వామ్యం**
- **పట్టణాల్లో 50.2 శాతం నమోదు**
- **పురుషుల భాగస్వామ్యంలో స్వల్ప పెరుగుదల**
- **పట్టణ ఉద్యోగ నిష్పత్తి స్థిరం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో ఉద్యోగ మార్కెట్‌కు సంబంధించిన తాజా గణాంకాలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2026 ఏప్రిల్ నుంచి జూన్ వరకు నిర్వహించిన కాలానుగుణ కార్మిక శక్తి సర్వే త్రైమాసిక నివేదికలో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారి కార్మిక శక్తి భాగస్వామ్య రేటు 54.6 శాతంగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. అంతకుముందు త్రైమాసికంలో ఈ రేటు 55.5 శాతంగా ఉండగా, తాజా త్రైమాసికంలో స్వల్పంగా తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారి కార్మిక శక్తి భాగస్వామ్య రేటులో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో పట్టణ కార్మిక శక్తి భాగస్వామ్య రేటు 50.2 శాతంగా నమోదైంది. అంతకుముందు త్రైమాసికంలోనూ ఇదే స్థాయిలో ఉండటంతో పట్టణ ప్రాంతాల్లో ఈ సూచిక స్థిరంగా కొనసాగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పురుషుల కార్మిక శక్తి భాగస్వామ్య రేటులో స్వల్ప పెరుగుదల నమోదైంది. అంతకుముందు త్రైమాసికంలో 75.0 శాతంగా ఉన్న ఈ రేటు 2026 ఏప్రిల్-జూన్‌లో 75.3 శాతానికి చేరింది. అంటే పట్టణ ప్రాంతాల్లో పురుషుల కార్మిక భాగస్వామ్యంలో స్వల్పంగా మెరుగుదల కనిపించింది. పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారి ఉద్యోగ జనాభా నిష్పత్తి కూడా స్థిరంగా కొనసాగింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఈ నిష్పత్తి 46.8 శాతంగా నమోదైంది. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే ఇందులో గణనీయమైన మార్పు లేదని కేంద్ర గణాంకాలు సూచిస్తున్నాయి.

కాలానుగుణ కార్మిక శక్తి సర్వే ద్వారా దేశంలో ఉపాధి పరిస్థితులు, కార్మికుల భాగస్వామ్యం, ఉద్యోగాల్లో ఉన్న జనాభా వంటి అంశాలపై త్రైమాసిక ప్రాతిపదికన గణాంకాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడిస్తోంది. 2026 ఏప్రిల్-జూన్ కాలానికి సంబంధించిన తాజా నివేదికలో పట్టణ, మొత్తం కార్మిక శక్తి భాగస్వామ్య పరిస్థితులను వివరించింది. ఈ గణాంకాలు దేశ ఉద్యోగ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న మార్పులను అంచనా వేసేందుకు ఉపయోగపడనున్నాయి. మొత్తంగా తాజా త్రైమాసికంలో దేశవ్యాప్తంగా కార్మిక శక్తి భాగస్వామ్య రేటు స్వల్పంగా తగ్గినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో ఈ సూచిక స్థిరంగా కొనసాగింది. అదే సమయంలో పట్టణ పురుషుల కార్మిక భాగస్వామ్యంలో స్వల్ప పెరుగుదల నమోదైంది. పట్టణ ఉద్యోగ జనాభా నిష్పత్తి కూడా 46.8 శాతం వద్ద స్థిరంగా ఉండటం ఉద్యోగ మార్కెట్‌లోని ప్రస్తుత పరిస్థితిని ప్రతిబింబిస్తోందని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది.

# ఎర్రకోటపై తొలిసారి వందేమాతరం

- **స్వాతంత్ర్య వేడుకల్లో ప్రత్యేక గీతాలాపన**
- **150 ఏళ్ల సందర్భంగా ఘన నివాళి**
- **యువశక్తికి ప్రాధాన్యమివ్వనున్న వేడుకలు**
- **వందేమాతరం అవమానంపై కఠిన శిక్షలు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలోని ఎర్రకోటపై తొలిసారిగా వందేమాతరం గేయం ఆలపించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో ఈ ప్రత్యేక గీతాలాపన జరగనుంది. వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు రక్షణ శాఖ కార్యదర్శి ఆర్‌కే సింగ్ వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోటకు చేరుకున్న అనంతరం వందేమాతరం గేయాన్ని ఆలపిస్తారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో యువశక్తికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించాలన్న లక్ష్యంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని ఈ వేడుకల ద్వారా చాటిచెప్పనున్నారు.

వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని రగిలించిన గేయంగా వందేమాతరానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎర్రకోటపై స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ గేయాన్ని ఆలపించడం ద్వారా దాని చారిత్రక ప్రాధాన్యాన్ని మరోసారి దేశానికి చాటిచెప్పనున్నారు. ఇదిలా ఉండగా వందేమాతరం గేయానికి సంబంధించిన కొత్త నిబంధనలపై ఇటీవల పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందింది. వందేమాతరం గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించడం, దాని ఆలాపనకు ఆటంకం కలిగించడం లేదా అడ్డుకోవడం వంటి చర్యలకు శిక్షలు విధించే నిబంధనలు అందులో పొందుపరిచినట్లు కేంద్రం తెలిపింది. నిబంధనలను ఉల్లంఘించిన వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

వందేమాతరం గేయాన్ని బంకించంద్ర ఛటర్జీ 1875లో రచించారు. అనంతరం ఆయన రచించిన ఆనందమఠ్ నవలలో ఈ గేయాన్ని చేర్చారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వందేమాతరం ప్రజల్లో జాతీయ భావాన్ని, స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. స్వాతంత్ర్యం అనంతరం దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఈసారి ప్రత్యేకంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వందేమాతరం గేయానికి 150 ఏళ్ల చారిత్రక సందర్భం, యువశక్తికి ప్రాధాన్యం, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని ప్రధాన అంశాలుగా తీసుకుని వేడుకలను నిర్వహించనున్నారు. ఎర్రకోటపై తొలిసారి వందేమాతరం గేయం ఆలపించనుండటంతో ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

# పరీక్షల అవకతవకలపై జార్ఖండ్‌లో విద్యార్థుల ఆగ్రహం



- **అసెంబ్లీ ముట్టడికి వేలాది మంది విద్యార్థుల ర్యాలీ**
- **సీబీఐ విచారణ, పరీక్షల రద్దు ప్రధాన డిమాండ్లు**
- **బారికేడ్లు తొలగించి ముందుకు దూసుకెళ్లిన ఆందోళనకారులు**
- **వాటర్ కెనాన్లు, లాఠీచార్జ్‌తో ఉద్రిక్తత**

**రాంచీ, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన తీవ్రరూపం దాల్చింది. పరీక్షల వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని, వివాదాస్పద నియామక పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు సోమవారం రాంచీలో అసెంబ్లీ వైపు భారీ ర్యాలీ చేపట్టారు. విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ యువత ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ ఉద్యమం ఎనిమిదో రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం, విద్యార్థి ప్రతినిధుల మధ్య మూడో విడత చర్చలు కూడా ఫలించకపోవడంతో ఆందోళనకారులు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో అంబులెన్సులోనే ర్యాలీలో పాల్గొనడం ఉద్యమానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది.

ఉదయం నుంచే జైపాల్ సింగ్ ముండా స్టేడియం పరిసరాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున గుమికూడారు. అనంతరం "ఛలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆందోళనకారులు మార్గమధ్యంలో ఏర్పాటు చేసిన పోలీసు బారికేడ్లను తొలగిస్తూ ముందుకు సాగారు. అసెంబ్లీ వైపు వెళ్లకుండా పలుమార్లు పోలీసులు అడ్డుకున్నారని విద్యార్థులు ఆరోపించారు. ర్యాలీలో పాల్గొన్న దేవేంద్ర నాథ్ మహతో మాట్లాడుతూ, ఆరోగ్యం సహకరించకపోయినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను అడ్డుకోవడం సరైన చర్య కాదన్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు.

మరోవైపు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. అసెంబ్లీ వైపు దూసుకువస్తున్న విద్యార్థులను నిలువరించేందుకు వాటర్ కెనాన్లను ప్రయోగించారు. అయినప్పటికీ విద్యార్థులు ముందుకు సాగేందుకు ప్రయత్నించడంతో కొన్ని ప్రాంతాల్లో తోపులాట చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో ఉన్న ఆందోళనకారులను చెదరగొట్టే క్రమంలో పోలీసులు లాఠీచార్జ్ కూడా నిర్వహించారు. దీంతో రాంచీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా 14వ జేపీఎస్సీ నియామక పరీక్షను రద్దు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించినప్పటికీ, ఇతర నియామక పరీక్షలపై కూడా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు పట్టుబడుతున్నారు. సీబీఐ విచారణకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని విద్యార్థి సంఘాలు ప్రకటించాయి.

# టాలీవుడ్ లక్కీ హీరోయిన్‌గా రితిక నాయక్!

టాలీవుడ్‌లో కొంతమంది హీరోయిన్లు కెరీర్ ప్రారంభంలోనే వరుస విజయాలను అందుకుంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటారు. అలాంటి హీరోయిన్ల జాబితాలో ఇప్పుడు రితిక నాయక్ పేరు వినిపిస్తోంది. తక్కువ సినిమాలకే ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ.. తాను నటించిన చిత్రాలు విజయవంతం కావడంతో టాలీవుడ్ లక్కీ హీరోయిన్‌గా మారుతోంది.

'అశోకవనంలో అర్జున కళ్యాణం'తో పరిచయం రితిక నాయక్ కథానాయికగా పరిచయమైన చిత్రం విశ్వక్ సేన్ నటించిన 'అశోకవనంలో అర్జున కళ్యాణం'. ఈ సినిమాలో ఆమె సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలి సినిమాతోనే నటిగా మంచి మార్కులు కొట్టేసిన రితికకు.. ఆ తర్వాత నాని నటించిన 'హాయ్ నాన్న'లో నటించే అవకాశం వచ్చింది. సినిమాలో ఆమె పాత్ర చిన్నదే అయినప్పటికీ.. తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంది.

ఆ తర్వాత తేజ సజ్జా హీరోగా తెరకెక్కిన 'మిరాయ్' సినిమాలో రితిక నాయక్ కథానాయికగా నటించింది. ఈ చిత్రంలో ఆమె పాత్రకు మంచి స్పందన లభించడంతో పాటు.. నటన పరంగానూ మరో మెట్టు ఎక్కింది. దీంతో టాలీవుడ్‌లో ఆమెకు అవకాశాలు మరింత పెరిగాయి.

తాజాగా వరుణ్ తేజ్‌తో కలిసి నటించిన 'కొరియన్ కనకరాజ్' కూడా విజయాన్ని అందుకోవడంతో రితిక ఖాతాలో మరో విజయం చేరినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆమె నటించిన సినిమాలు వరుసగా విజయాలు సాధిస్తున్నాయనే టాక్ పరిశ్రమలో వినిపిస్తోంది.

హీరోయిన్‌గా ఎంచుకుంటున్న కథలు, పాత్రలు కూడా రితిక కెరీర్‌కు కలిసొస్తున్నాయని అభిమానులు అంటున్నారు. ఇప్పటివరకు చేసిన సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. ఇదే జోరును కొనసాగిస్తే టాలీవుడ్‌లో మరింత బిజీ హీరోయిన్‌గా మారడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వరుస విజయాలతో రితిక నాయక్ నిజంగానే టాలీవుడ్ లక్కీ హీరోయిన్‌గా మారుతుందా? ఆమెకు మరిన్ని అవకాశాలు దక్కుతాయా? అనేది రాబోయే సినిమాలతో తేలనుంది.





# అఖిల్ తదుపరి సినిమా.. ఇంకా ఏదీ ఖరారు కాలేదు!

అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని ఎట్టకేలకు తన కెరీర్‌లో కీలక విజయాన్ని అందుకున్నారు. ఇటీవల విడుదలైన గ్రామీణ నేపథ్య యాక్షన్ డ్రామా 'లెనిన్'తో అఖిల్ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన కెరీర్‌లో వచ్చిన చిత్రాల్లో ఇదే తొలి భారీ కమర్షియల్ హిట్‌గా నిలవడంతో అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. చాలా కాలంగా అఖిల్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు 'లెనిన్' విజయం భారీ ఊరటనిచ్చింది.

ఈ సినిమా విజయంతో అఖిల్ తదుపరి ప్రాజెక్ట్‌పై సహజంగానే ఆసక్తి పెరిగింది. అయితే ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో అఖిల్ తదుపరి సినిమాకు సంబంధించి పలు రకాల వార్తలు, ప్రచారాలు వైరల్ అవుతున్నాయి. కొన్ని ప్రాజెక్టులు ఖరారయ్యాయని, పలువురు దర్శకులతో ఆయన చర్చలు జరుపుతున్నారని ప్రచారం జరుగుతోంది.

అధికారిక ప్రకటన ఏదీ లేదు

అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని అఖిల్ బృందం స్పష్టం చేసింది. అఖిల్ తన తదుపరి సినిమాను ఇప్పటివరకు ఏదీ ఖరారు చేయలేదని అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న ఎలాంటి వార్తలను నమ్మవద్దని, వాటిని మరింతగా ప్రచారం చేయవద్దని అభిమానులు, మీడియాను కోరింది. అఖిల్ తదుపరి ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను త్వరలోనే వెల్లడిస్తామని ఆయన బృందం తెలిపింది. దీంతో ప్రస్తుతం అఖిల్ తదుపరి సినిమాపై వస్తున్న వార్తలన్నీ కేవలం ఊహాగానాలేనని స్పష్టమైంది.

'లెనిన్' తర్వాత మరింత జాగ్రత్తగా..

'లెనిన్' వంటి భారీ విజయం తర్వాత అఖిల్ తన తదుపరి సినిమాను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. తన కెరీర్‌కు మంచి మలుపునిచ్చిన 'లెనిన్' తర్వాత వచ్చే చిత్రం కూడా అదే స్థాయిలో ఉండాలని అక్కినేని అభిమానులు కోరుకుంటున్నారు.

# 'టాక్సిక్' ట్రైలర్ వేడుకలో రుక్మిణి వసంత్.. పాలరాతి శిల్పంలా!

రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన టీజర్, పోస్టర్లు సినిమాపై మరింత హైప్‌ను పెంచాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం తాజాగా 'టాక్సిక్' ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ, తారా సుతారియా తదితరులు హాజరయ్యారు.

ఈ వేడుకలో రుక్మిణి వసంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. క్రీమ్ రంగు దుస్తుల్లో సింపుల్ లుక్‌తో ఆమె పాలరాతి శిల్పంలా కనిపించారు. సహజమైన అందం, సింపుల్ మేకప్, చక్కటి హెయిర్ స్టైల్‌తో వేడుకకు వచ్చిన అభిమానులు, సినీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు.

ఖరీదైన దుస్తుల్లో మెరిసిన భామ

రుక్మిణి వసంత్ ధరించిన దుస్తుల ధర సుమారు రూ.54,269 ఉంటుందని సమాచారం. దీనికి జోడీగా ఆమె ధరించిన హీల్స్ విలువ సుమారు రూ.4,350గా తెలుస్తోంది. సాధారణ చెవి రింగులు, చైన్, సింపుల్ మేకప్‌తో ఆమె తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకున్నారు.

ట్రైలర్ విడుదల కార్యక్రమానికి సంబంధించిన రుక్మిణి ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అభిమానులు ఆమె సింపుల్ లుక్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

'టాక్సిక్'పై పెరుగుతున్న అంచనాలు

'టాక్సిక్' ట్రైలర్ విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. యశ్ విభిన్న కోణాలు, తండ్రీకొడుకుల ప్రతీకార కథ, బలమైన మహిళా పాత్రలు, హైవోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ప్రత్యేకమైన మేకింగ్ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం భావిస్తోంది. 'టాక్సిక్'తో యశ్ మరోసారి బాక్సాఫీస్ వద్ద భారీ ప్రభంజనం సృష్టిస్తాడా? అనేది సినిమా విడుదల తర్వాత తేలనుంది.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమావేశం



**హనుమకొండ,ఆగస్టు10(తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమావేశం మాధవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సుమారు 50 మంది విశ్రాంత ఉద్యోగులు హాజరయ్యారు.

సింగరేణి సంస్థలో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న కార్మికులకు కూడా సీపీఆర్ఎంఎస్ వైద్య సేవలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరారు. వారికి కూడా సీపీఆర్ఎంఎస్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం అందుతున్న చాలీచాలని పింఛన్‌తో విశ్రాంత ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనీస పింఛన్‌ను రూ.10 వేలుగా నిర్ణయించి, దానికి అనుగుణంగా పింఛన్ అందించాలని కోరారు. అర్హులైన విశ్రాంత ఉద్యోగులకు ఆసరా పింఛన్‌తో పాటు గ్రీన్ రేషన్ కార్డులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో నలుబాల దామోదర్, కోశాధికారి రాంమోజు రామ్మూర్తి, సదానందం, విద్యాసాగర్, చారి తదితరులు పాల్గొన్నారు.

# జానపద సొగసుతో 'సిలుకు సిలుకు సీరాలు'..!

- క్యాతంపల్లిలో ఘనంగా పాట చిత్రీకరణ ప్రారంభం..
- త్వరలో ప్రేక్షకుల ముందుకు పూర్తి గీతం

**ధర్మసాగర్,ఆగస్టు10(తెలంగాణ ముచ్చట్లు):**

జానపద సొబగులు, గ్రామీణ జీవనశైలి, ప్రేమానురాగాలను ప్రతిబింబించేలా తెరకెక్కుతున్న 'సిలుకు సిలుకు సీరాలు నాకే తెస్తానంటాడు నా మొగుడే' పాట చిత్రీకరణకు క్యాతంపల్లి గ్రామంలో ఘనంగా శ్రీకారం చుట్టారు. ప్రముఖ గాయకుడు "అనితా ఓ అనితా సాంగ్ ఫేమ్" నాగరాజు చేతుల మీదుగా చిత్రీకరణ ప్రారంభం కావడంతో గ్రామంలో సందడి నెలకొంది. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ పాటకు జేఎన్ దర్శకత్వం వహిస్తుండగా, జానీ ఏజే కొరియోగ్రఫీ అందిస్తున్నారు. నాని మైలారం పాటకు సాహిత్యం అందించగా, బాను టెంపో సంగీతాన్ని సమకూరుస్తున్నారు. రాకీ భాయ్ ఛాయాగ్రహణ బాధ్యతలు చేపట్టారు. మమతా రమేష్ గానం అందిస్తున్నారు.

పాటలో స్వప్న కథానాయికగా, ప్రకాష్ మహారాజ్ కథానాయకుడిగా నటిస్తున్నారు. అరవింద్ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, నవీన్ బృంద నిర్వాహకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.




**గ్రామీణ వాతావరణంలో ప్రత్యేక ఆకర్షణగా చిత్రీకరణ**

క్యాతంపల్లి గ్రామంలోని సహజమైన వాతావరణాన్ని పాట చిత్రీకరణ కోసం వినియోగించుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక ప్రజల సహకారంతో పాటకు సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. చిత్రీకరణను చూసేందుకు గ్రామ ప్రజలు ఆసక్తిగా తరలివచ్చారు.

ఈ సందర్భంగా చిత్ర బృందం మాట్లాడుతూ తమకు సహకరించిన జీవీ ఫోక్స్, అర్చన ఏజే లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అలాగే అనితా, నాగరాజు చేతుల మీదుగా చిత్రీకరణ ప్రారంభించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంది.

**క్యాతంపల్లి ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు**

పాట చిత్రీకరణకు సంపూర్ణ సహకారం అందించిన క్యాతంపల్లి గ్రామ ప్రజలందరికీ, గ్రామ సర్పంచ్‌కు, తమకు అండగా నిలిచిన పెద్దలందరికీ చిత్ర బృందం కృతజ్ఞతలు తెలిపింది.ముఖ్యంగా రాజిత, రాజు, కుమార్, సునిత, రవి, నిర్మల, కొమరయ్య, సుజానా తదితరులు అందించిన సహకారాన్ని చిత్ర బృందం ప్రత్యేకంగా గుర్తుచేసుకుంది.

**త్వరలో పూర్తి పాట విడుదల**

సంగీతం, సాహిత్యం, నృత్యం, గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న 'సిలుకు సిలుకు సీరాలు నాకే తెస్తానంటాడు నా మొగుడే' పాటను త్వరలో పూర్తి స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. పాటకు సంబంధించిన పూర్తి వీడియోను 'JN Tunes 406' వేదికలో విడుదల చేయనున్నారు. చిత్రీకరణలో జరిగిన ఆసక్తికర సన్నివేశాలు, తెరవెనుక విశేషాలను 'Journey With JN 406' వేదికలో అందించనున్నారు. సామాజిక మాధ్యమాల్లో 'JN Team 406' పేరుతో పాటకు సంబంధించిన తాజా సమాచారం అందుబాటులో ఉండనుంది.

జానపద సంగీతాన్ని అభిమానించే ప్రతి ఒక్కరూ ఈ పాటను ఆదరించి, తమ బృందాన్ని ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు.









# ప్రియాంక మృతదేహం స్వగ్రామానికి తరలింపు

- మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే శ్రీనివాస్ పరామర్శ
- తల్లిదండ్రులకు మృతదేహం అప్పగించిన వైద్యులు
- ఏక్లాస్‌పురంలో సాయంత్రం అంత్యక్రియలు
- విషాదంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

**హైదరాబాద్, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయింది. అనంతరం ఆస్పత్రి అధికారులు ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రియాంక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పోస్టుమార్టం అనంతరం ప్రియాంక మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన గద్వాల జిల్లా ఐజ మండలం ఏక్లాస్‌పురానికి తరలించారు. స్వగ్రామానికి మృతదేహం చేరుకోగానే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రియాంకను చివరిసారిగా చూసేందుకు గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గత కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రియాంక ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు ఆశలు పెట్టుకున్నప్పటికీ, చివరకు ఆమె మృతి చెందడం అందరినీ కలచివేసింది. వైద్య విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో వైద్యురాలిగా సేవలు అందించాలని కలలు కన్న ప్రియాంక అకాల మరణం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి వాకిటి శ్రీహరి పరామర్శ

ప్రియాంక మృతిపై సమాచారం అందుకున్న మంత్రి వాకిటి శ్రీహరి గాంధీ ఆస్పత్రికి చేరుకుని ఆమె తండ్రిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాజమండ్రి ఎమ్మెల్యే శ్రీనివాస్ కూడా ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రియాంక మృతి అత్యంత బాధాకరమని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదగాల్సిన యువతి అకాల మరణం సమాజానికి తీరని లోటని అభిప్రాయపడ్డారు. ప్రియాంక అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ఆమె స్వగ్రామం ఏక్లాస్‌పురంలో నిర్వహించనున్నారు. అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది. ప్రియాంక మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

# పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం కూల్చివేతపై ఆగ్రహం

**నర్సంపేట, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని కూల్చివేయడాన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ప్రజల ప్రేమాభిమానాలకు గుర్తుగా ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో తొలగించడం అత్యంత దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ చర్య ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. సోమవారం నర్సంపేట పట్టణానికి చేరుకున్న బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రి ఎరబెల్లి దయాకర్ రావుతో కలిసి విగ్రహం తొలగించిన ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి నర్సంపేట పట్టణ జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

మాట్లాడిన బోయినపల్లి వినోద్ కుమార్, పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకుడని అన్నారు. ఆయన మరణించిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిందని గుర్తు చేశారు. అలాంటి నాయకుడి విగ్రహాన్ని కూల్చివేయడం ద్వారా ప్రభుత్వం విరుద్ధ సంకేతాలు పంపుతోందని విమర్శించారు. ప్రైవేట్ స్థలంలో ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న విగ్రహాన్ని తొలగించడానికి గల కారణాలను ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసే చర్యలకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని, ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించడం సమంజసం కాదని బోయినపల్లి వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. విగ్రహం తొలగింపుపై స్థానిక ప్రజల్లో కూడా అసంతృప్తి వ్యక్తమవుతోందని చెప్పారు. విగ్రహాన్ని అదే ప్రదేశంలో తిరిగి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చట్టపరంగా, న్యాయపరంగా ముందుకు వెళ్లి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజల గౌరవానికి, నాయకుల జ్ఞాపకాలకు భంగం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.





# మెట్‌పల్లిలో అరుదైన ప్రసవం

- ఒకే కాన్పులో ముగ్గురు చిన్నారులు
- రాజలక్ష్మి–నరేందర్ దంపతులకు తొలి సంతానంగా ముగ్గురు పిల్లలు
- ఒక బాబు, ఇద్దరు పాపలకు జన్మనిచ్చిన మహిళ
- తల్లి, చిన్నారుల ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు
- కుటుంబంలో ఆనందోత్సాహాలు

**మెట్‌పల్లి, ఆగస్టు 10 (తెలంగాణ ముచ్చట్లు):**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో అరుదైన ప్రసవం చోటుచేసుకుంది. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ఒక మహిళ ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనివ్వడం విశేషంగా నిలిచింది. రాజేశ్వర్‌రావుపేటకు చెందిన రాజలక్ష్మి-నరేందర్ దంపతులకు తొలి సంతానంగా ఒక బాబు, ఇద్దరు పాపలు జన్మించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజలక్ష్మి గర్భధారణ సమయంలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు సమాచారం. ప్రసవ సమయం దగ్గరపడటంతో ఆమెను మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో జరిగిన ప్రసవంలో ముగ్గురు చిన్నారులు సురక్షితంగా జన్మించారు. ఒకేసారి ముగ్గురు పిల్లలు జన్మించడం వైద్యపరంగా అరుదైన ఘటనగా భావిస్తున్నారు.

ముగ్గురు చిన్నారులు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. నవజాత శిశువులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించామని, ప్రస్తుతం ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని పేర్కొన్నారు. తల్లి ఆరోగ్య పరిస్థితి కూడా నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు వెల్లడించారు. తొలి సంతానంగానే ముగ్గురు పిల్లలు జన్మించడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ శుభవార్త తెలిసిన వెంటనే బంధువులు, స్నేహితులు ఆస్పత్రికి చేరుకుని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలోనూ ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించడం అరుదైన సంఘటన కావడంతో స్థానిక ప్రజలు కూడా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణుల పర్యవేక్షణ వల్లే ఇలాంటి ప్రసవాలు విజయవంతంగా నిర్వహించడం సాధ్యమవుతోందని వైద్యులు పేర్కొన్నారు. తల్లి, ముగ్గురు చిన్నారుల ఆరోగ్యం సంతృప్తికరంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. మరికొన్ని రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అనంతరం ఇంటికి పంపించే అవకాశం ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ అరుదైన ప్రసవం మెట్‌పల్లి ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in